# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్

5 | నిజామాబాద్, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | NIZAMABAD




## తెలంగాణ వర్సిటీ ల్యాబ్‌లో
# పాముల కలకలం

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో పాములు శనివారం కలకలం రేపాయి. కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లోకి దూరిన రెండు విష సర్పాలు స్వేచ్ఛగా తిరుగుతుండడాన్ని చూసి సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న మరికొందరు సిబ్బంది వచ్చి వాటిని చాకచక్యంగా బయటికి పంపించడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

–డిచ్‌పల్లి, సెప్టెంబర్ 21

# కక్షిదారుల ఆశలను నెరవేర్చాలి

- విచారణలో డాక్యుమెంటరీ సాక్ష్యాలు కీలకం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్
- జిల్లా కోర్టులో న్యాయాధికారులతో సమీక్ష



హైకోర్టు జడ్జి జస్టిస్ సురేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 21: వేలాది మంది కక్షిదారులు కోర్టులపై ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో వస్తారని, వాటిని పరిపూర్ణం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.సురేందర్ న్యాయాధికారులకు దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్ జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలతో కలిసి న్యాయాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జస్టిస్ సురేందర్ మాట్లాడుతూ.. న్యాయ వివాదాలను న్యాయార్థుల అభిమతం మేరకు పరిష్కరించడంలో అగ్రభాగంలో ఉండాలని సూచించారు. క్రిమినల్ కేసులను విచారించే క్ర మంలో ఒక దిశలో వెళ్లాలని అన్నారు. అలా వెళ్లే మార్గంలో అవసరమైన మేరకు సాక్షుల శాతం తగ్గి కేసులు త్వరిత గతిన పరిష్కరించుకునే వీలు ఉంటుందన్నారు. సివిల్ దావాల విచారణలో డాక్యుమెంటరీ సాక్ష్యాలు కీలకమైనవని, వాటిని అధ్య యం చేయడం మూలంగా న్యాయ వివాదాలు సులభంగా పరిష్కరించే వీలు కలుగుతుందని అన్నారు. జిల్లా అదనపు జడ్జీలు కనకదుర్గ, శ్రీనివాస్, ఆశలత తదితరులు పాల్గొన్నారు.

### జడ్జీలను నియమించాలని వినతి..

జిల్లా కోర్టు ప్రాంగణంలోని వివిధ కోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తి పోస్టులను భర్తీ చేయాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం హైకోర్టు న్యాయమూర్తి కె.సురేందర్‌కు వినతిపత్రం అందజేసింది. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బార్ బాధ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను జడ్జి దృష్టికి తీసుకెళ్లారు.న్యాయవాదులు రాజు, వసంత్ రావ్, దీపక్, గోవర్ధన్, రాజలింగం, కృపాకర్‌రెడ్డి, కవితారెడ్డి, ఆశనారాయణ, శ్రీకాంత్, మానిక్‌రాజ్, అయ్యూబ్, రవి, రాజ్‌కుమార్ సుబేదార్ పాల్గొన్నారు.

- రుణాలు తీసుకోవడంలో, చెల్లించడంలో నంబర్‌వన్
- కమ్మర్‌పల్లి మండల సమాఖ్య విజయగాథ
- రాష్ట్రంలోనే ఉత్తమ సమాఖ్య అవార్డు సొంతం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ప్రభుత్వ చేయూతతో సంపదను సృష్టిస్తున్నారు. రుణాలు తీసుకోవడమే కాదు, చెల్లించడంలోనూ ముందుంటున్నారు. వీరి పనితీరుకు మెచ్చి యంత్రాంగం కూడా విరివిగా లోన్లు మంజూరు చేస్తున్నది. మహిళల సహకారంతో రికవరీ కూడా భారీగా ఉంటున్నది. అందువల్లే కమ్మర్‌పల్లి మండల సమాఖ్య రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. లక్ష్యాన్ని మించి రుణాలు ఇవ్వడంతో పాటు రికవరీలోనూ ముందున్న ఉన్న కమ్మర్‌పల్లి మండల సమాఖ్య 2022-23 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ మండల సమాఖ్యగా ఎంపికైన సంగతి తెలిసింది. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మండల సమాఖ్య ప్రతినిధులకు అవార్డును అందజేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తూ రాష్ట్రస్థాయి అవార్డులను సొంతం చేసుకుంటున్న కమ్మర్‌పల్లి మండల సమాఖ్య.. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

–మోర్తాడ్, సెప్టెంబర్ 21



# సమాఖ్యంగా.. సంపద సృష్టి

### అభివృద్ధి బాటలో మహిళామణులు

సండే స్పెషల్

రాష్ట్రంలో ఉన్న 594 మండలాల్లో ఉత్తమ మండలంగా ఎంపిక కావాలంటే అదంతా సులువుగా అయ్యే పని కాదు. ఎంతో కృషి, పట్టుదల, సమగ్ర కార్యాచరణ ఉండాలి. లోన్లు ఇవ్వడంతో పాటు రికవరీలోనూ ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలి. ఆయా జాగ్రత్తలన్నీ తీసుకుంటూ కమ్మర్‌పల్లి మండల సమాఖ్య ఆదర్శంగా నిలిచింది. అందుకే, ఎనిమిది సార్లు జిల్లాలో ఉత్తమ అవార్డులు అందుకోవడమే కాక, 2017-18లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచింది. అయితే, ప్రథమ స్థానంలో ఎందుకు నిలవద్దనే కసితో అటు మహిళా సమాఖ్య సభ్యులు, ఇటు సిబ్బంది కష్టపడి పని చేసి చివరకు అనుకున్నది సాధించారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ సమాఖ్య అవార్డును అందుకుంటున్న మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి

### లక్ష్యానికి మించి రుణాల మంజూరు

వాస్తవానికి ప్రతి మండల సమాఖ్యకు రుణాల మంజూరు విషయంలో లక్ష్యం విధిస్తుంటారు. ఆ టార్గెట్‌ను చేరుకోవడం అంత ఈజీ కాదు. కానీ, కమ్మర్‌పల్లి మండల సమాఖ్య 2022-23 సంవత్సరానికి గాను మహిళాసంఘాలకు రు ణాల మంజూరులో లక్ష్యా న్ని దాటింది. మండలానికి రూ.726. 62 లక్షల రుణాలు ఇవ్వాలని అధికారులు టార్గెట్ విధించగా, అంతకు మించి రూ.789.37 లక్షల రుణాలను మహిళాసంఘాలకు ఇచ్చారు. రూ.264.68 లక్షలు వ్యాపారేతర పనులకు, రూ.524.88 లక్షలు ఆదాయాభివృద్ధి, వివిధ వ్యాపారాల కోసం రుణాలు అందజేశారు. ఇందులో ఎక్కువ శాతం రుణాలను ఆదాయాభివృ ద్ధి కోసం ఇవ్వడం విశేషం. లోన్లు ఇవ్వడంతోనే సమాఖ్య సభ్యులు చేతులు దులుపుకోలేదు. రికవరీలోనూ అదే పట్టుదల ప్రదర్శించారు. విరివిగా అందివచ్చిన లోన్లను సద్వినియోగం చేసుకున్న మహిళలు.. వివిధ వ్యాపారాలు స్థాపించారు. వచ్చిన ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని లోన్లు కట్టడానికి వినియోగించారు. ఫలితంగా రుణాల రికవరీలోనూ కమ్మర్‌పల్లి మండల సమాఖ్య ముందంజలో నిలిచింది. మండల వ్యాప్తం గా రికవరీ 99.20 శాతం నమోదుకావడం గమనార్హం.

### సకాలంలో రుణాల చెల్లింపులు



మహిళాసంఘాలు క్రమశిక్షణతో ఉండడం, పొదుపు చేయడంలో, రుణాల చెల్లింపులో ఆదర్శవంతంగా ఉండడం వల్లే రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. జిల్లా, మండల అధికారుల పర్యవేక్షణలో రుణాలతో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం, ఆదాయవృద్ధి విషయంలో అధికారుల సూచనలు, సలహాలు ఉపయోగపడుతున్నాయి. మహిళాసంఘాలు, ఐకేపీ సిబ్బంది, అధికారుల కృషి కారణంగానే ఉత్తమ మండల సమాఖ్యగా నిలువగలిగాం.

**-రోజారాణి, కమ్మర్‌పల్లి మండల సమాఖ్య అధ్యక్షురాలు**

### సమష్టి కృషి ఫలితంగానే..



కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ సలహాలు, సూచనలు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగానే రాష్ట్రంలోనే ఉత్తమ మండల సమాఖ్యగా ఎంపికైంది. లక్ష్యానికి అనుగుణంగా, సమయానుసారంగా పనిచేయడం, మహిళలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందజేయడం, విధి నిర్వహణలో రాజీపడకుండా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం కారణంగా రాష్ట్రంలోనే రెండు సార్లు అవార్డులను అందుకోగలిగాం. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం.

**-కుంట గంగాధర్, కమ్మర్‌పల్లి ఏపీవో**

### రుణాలతో వివిధ వ్యాపారాలు

మహిళాసంఘాల ద్వారా ఇచ్చిన రుణాలతో చాలా మంది మహిళలు వ్యాపారాలను ఏర్పాటు చేసుకున్నారు. కిరాణ దుకాణాలు, టైలరింగ్, కులవృత్తులు, టెంట్‌హౌస్, బ్యూటీపార్లర్లు, మగ్గం వర్క్స్, దేశీ కోళ్ల పెంపకం, పేపర్‌ప్లేట్ల తయారీ, తెలంగాణ పిండి వంటలు, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలు స్థాపించారు. అంతేకాదు, వాటిని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా వారి సంపద పెరిగింది. దీంతో రుణాలను నిర్దిష్ట సమయం కన్న ముందే చెల్లిస్తున్నారు. వ్యాపారాలు విజయవంతంగా నడవడంతో, రికవరీ విషయంలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. తరచూ సమావేశాలను నిర్వహించడం, రుణాల మంజూరు, రికవరీ విషయంలో కమ్మర్‌పల్లి మండల సమాఖ్య ముందుకు దూసుకెళ్తున్నది.



స్త్రీనిధి ఆధ్వర్యంలో బషీరాబాద్‌లో కొనసాగుతున్న పేపర్‌ప్లేట్ తయారీ కేంద్రం



# దంచికొట్టిన వాన


వాడి,హొన్నాజీపేట్ మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

నాగిరెడ్డిపేట/ధర్పల్లి, సెప్టెంబర్ 21: ఉమ్మడి జిల్లాలో వాన దంచికొట్టింది. పలు మండలాల్లో శనివారం కురిసిన వర్షం రైతులను ఆగం జేసింది. ధర్పల్లి, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, నాగిరెడ్డిపేట, ఆర్మూర్ తదితర మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ధర్పల్లి మండలంలో శనివారం తెల్లవారుజామున వాన దంచికొట్టడంతో వాడి, హొన్నాజీపేట్ గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద మట్టితో వేసిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. పంటలు చేతికొచ్చిన తరుణంలో కురుస్తున్న వానలతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వానకాలంలో సాగు చేసిన మక్కజొన్నను కోసి కల్లాల్లో ఆరబెట్టిన రైతులు వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. వరి పైర్లు పొట్ట దశలో ఉన్న తరుణంలో భారీ వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గిపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

# రైస్‌మిల్ యజమానిపై క్రిమినల్ కేసు ?

ఎడపల్లి, సెప్టెంబర్ 21: మండల కేంద్ర శివారులోని ఏఆర్ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు యజమానితో పాటు మరో వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. సీఎంఆర్ ఇవ్వకపోవడంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి రైస్‌మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. డీటీలు మహేశ్, నిఖిల్ రాజ్, వినోద్ శనివారం పంచనామా నిర్వహించారు. 95 వేల క్వింటాళ్ల ధాన్యం తరుగు ఉందని, వీటి విలువ రూ. 21కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. మిల్లు యజమాని ఎం.రంజిత్‌తో పాటు మరో వ్యక్తి పి.కిషన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఓఎస్‌డీ తెలిపారు.

- దోమకొండలో ప్రేమజంట ఆత్మహత్య
- అప్పుల బాధతో మరొకరు..
- మద్యానికి బానిసై ఇద్దరు బలవన్మరణం



# ఇవేం బలవంతపు చావులు

ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయి. చిన్నచిన్న సమస్యలకే ఉసురు తీసుకుంటున్నారు. తాజాగా వేర్వేరు ఘటనల్లో ఐదుగురు బలవన్మరణాలకు పాల్పడడం జిల్లాలో కలకలం రేపింది. ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించడం లేదని ఓ జంట ఆత్మహత్యకు పాల్పడింది. మద్యానికి బానిసై ఇద్దరు బలవన్మరణం చెందగా, అప్పుల బాధతో మరో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

–కామారెడ్డి/డిచ్‌పల్లి/బాల్కొండ/నవీపేట, సెప్టెంబర్ 21

### మద్యానికి బానిసై..

అప్పుల బాధ తాళలేక మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాలపడ్డాడు. బాల్కొండ ఎస్సై నరేశ్ కథనం మేరకు.. మండల కేంద్రంలోని పోచమ్మ కాలనీకి చెందని జెట్టి సాయిబాబు (48)కు భార్య, పిల్లలు ఉన్నారు. మూడేండ్ల క్రితం కూతురి వివాహం చేయడంతో అప్పులు అయ్యాయి. ఈ క్రమం లో మద్యానికి బానిసైన సాయిబాబు.. తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతూ ఉండేవాడు. శుక్రవారం కూడా బాగా తాగొ చ్చి గొడవ చేసిన అతడు రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కాసేపటి తర్వాత చూడగా, చీరతో దులానికి ఉరేసుకుని కనిపించాడు. కుమారుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మరోచోట..

మద్యానికి బానిసై మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన డిచ్‌పల్లి ఠాణా పరిధిలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తేలు రాధాకృష్ణ (32)కు భార్య సంగీత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. అయితే, మద్యానికి బానిసైన రాధాకృష్ణ శనివారం తెల్లవారుజామున నిద్ర లేచాడు. సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఇంట్లోనే చీరతో ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### అప్పుల బాధతో..



అల్లె వినోద్‌కుమార్(ఫైల్)

అప్పుల బాధతో మనస్తాపం చెంది ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై సాయారెడ్డి కథనం ప్రకారం.. నవీపేట్ రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహం పడి ఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు నవీపేట్ మండలం అభంగపట్నం గ్రామానికి చెందిన అల్లె వినోద్‌కుమార్ (30)గా గుర్తించారు. ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లేందుకు యత్నించగా, మెడికల్ ఫిట్‌నెస్‌లో ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడం, మెడికల్ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన వినోద్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.




మొగిలి సాయికుమార్, రంగోలి వీణ(ఫైల్)

### ప్రేమను అంగీకరించలేదని..

పెద్దలు పెండ్లికి అంగీకరించకపోవడంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. దోమకొండ మండలం అంబర్‌పేట్ గ్రామంలో చోటు చేసుకున్న ఈ విషాదం శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన రంగోలి వీణ (23) డిగ్రీ మధ్యలోనే ఆపేసి, ఇంట్లో ఉంటున్నది. బీబీపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన మొగిలి సాయికుమార్ (24) మెదక్ జిల్లా తూప్రాన్‌లో పీఈటీగా పని చేస్తున్నాడు. అయితే, కళాశాలలో చదివే సమయంలో వీణ, సాయికుమార్ మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో పెండ్లి చేసుకోవాలనుకున్న ఆ జంటకు నిరాశే ఎదురైంది. యువతి తరపు కుటుంబ సభ్యులు పెండ్లికి నిరాకరించారు. అయినప్పటికీ వారిని ఒప్పించేందుకు ప్రేమ జంట చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో కలిసి బతకలేమని, బలవన్మరణమే శరణ్యమని ప్రేమికులు భావించారు. ఈ క్రమంలో శుక్రవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయికుమార్ తమ పొలంలోని బావి వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకోగా, వీణ తన ఇంట్లో బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, దోమకొండ ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇరు కుటుంబాలను విచారించగా, ప్రేమ పెండ్లికి పెద్దలు అంగీకరించలేదన్న భావనతోనే ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో గల కొండా లక్ష్మణ్ విగ్రహానికి పద్మశాలీ సంఘం, బీఆర్ఎస్ నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే, పలు మండలాల్లోనూ బాపూజీ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

–కామారెడ్డి,సెప్టెంబర్ 21